క్లుప్తంగా

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగనాయకులు

బేస్తవారిపేట: మహిళలు, పురుషులు అనే వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ జీవనోపాధి కల్పించాలని ఎంపీడీఓ ఎ.రంగనాయకులు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సుస్థిర అభివృద్ధిపై సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అందేలా దరఖాస్తు చేయించాలని చెప్పారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం



లా కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులతో ప్రిన్సిపాల్

మార్కాపురం టౌన్: అంతర్జాతీయ విశ్వజనీన మానవ హక్కుల దినోత్సవాన్ని స్థానిక ఎస్ఎస్ లా కాలేజీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కోనయ్య మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా విప్లవాలను, తిరుగుబాట్లను దృష్టిలో పెట్టుకుని ఐక్యరాజ్యసమితి 1948లో డిసెంబర్ 10వ తేదీని విశ్వజనీన మానవ హక్కుల దినంగా ప్రకటించిందన్నారు. మానవహక్కులను ఉల్లంఘించిన వారిపై అంతర్జాతీయ సంస్థలు విచారణ చేపడతాయన్నారు. మానవ హక్కుల నేరాలు, టెర్రరిజం, నియంతృత్వ పోకడలు ప్రపంచ వ్యాప్తంగా సాగుతుండటం ఆందోళనకరమన్నారు. కార్యక్రమంలో న్యాయవాది యూసఫ్ అలీఖాన్, కళాశాల ఏవో రమేష్ నాయక్, అధ్యాపకులు, లా విద్యార్థులు పాల్గొన్నారు.

14న సాగునీటి సంఘాల ఎన్నికలు



మాట్లాడుతున్న తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్: సాగునీటి సంఘాల ఎన్నికలు ఈ నెల 14వ తేదీ నిర్వహించనున్నట్లు మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ సాగుతుందని, ముందుగా డీసీ (డిస్ట్రిబ్యూటరీ కమిటీ), అదే రోజు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ల ఎన్నిక నిర్వహిస్తామని వివరించారు. మార్కాపురం మండలంలో 8 సాగునీటి సంఘాలు ఉన్నాయని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. బుధవారం పోలింగ్ సిబ్బందికి తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలి

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎస్టీయూ నాయకులు



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకుడు

కంభం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అర్ధవీడు మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్ నుంచి లోన్ల రూపంలో, రిటైర్డ్ అయి క్లోజర్ రూపంలో ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ నగదుగా మార్చుకున్న వాటిని చెల్లించలేదని ఉపాధ్యాయులు సంఘం దృష్టికి తెచ్చారని తెలిపారు. బోధనకు ఆటంకం కలిగిస్తున్న యాప్‌లను తొలగిస్తామని చెప్పిన ప్రభుత్వం వాటిని పెంచుతుందే గానీ తొలగించడం లేదని, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డీ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా మహేష్, కార్యదర్శిగా వెంకట్రావు, జిల్లా కౌన్సిలర్‌గా నభిఖాన్, కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్వర్లు, రజని, కాశీరావు, అబ్దుల్ సాలెహా, సలోమిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డీ సిద్దిక్, నభిఖాన్, తదితరులు పాల్గొన్నారు.

అల్ట్రా డీలక్స్‌తో అదనపు భారం!

గిద్దలూరు డిపోలో బస్సుల వివరాలు	
సూపర్ లగ్జరీ	8
అల్ట్రా డీలక్స్	8
ఎక్స్‌ప్రెస్	15
పల్లెవెలుగు	43

ఆర్టీసీ టికెట్ ధరలు కంభం నుంచి ఒంగోలుకు..	
ఆర్డినరీ	రూ.100
ఎక్స్‌ప్రెస్	రూ.150
అల్ట్రాడీలక్స్	రూ.185



అల్ట్రా డీలక్స్‌లో డ్రైవర్ వద్ద టికెట్ తీసుకుంటున్న ప్రయాణికులు

- గిద్దలూరు డిపో నుంచి జిల్లా కేంద్రానికి ఆర్డినరీ బస్సులు నిలిపివేత
- ఎక్స్‌ప్రెస్ బస్సుల వేళల్లో తరచూ అల్ట్రా డీలక్స్ బస్సులు ప్రత్యక్షం
- చార్జీ పెరిగినా అల్ట్రా డీలక్స్‌లో ఆలస్యమవుతున్న ప్రయాణం
- కండక్టర్ లేకపోవడంతో డ్రైవర్‌పై పెరుగుతున్న ఒత్తిడి
- ఓ వైపు టిక్కెట్లు కొట్టాలి.. మరో వైపు బస్సు నడపాలి

కంభం:

జిట్టున్నమ్మ ఏ కొప్పెనా కడుతుందన్న చందాన డబ్బున్నవాళ్లు ఏ బస్సులోనైనా ప్రయాణం చేయగలరు కానీ పేద ప్రజలు మాత్రం టికెట్‌పై ఎంతో కొంత మిగిలితే చాలని భావిస్తుంటారు. వెళ్లిన పని పూర్తి చేసుకుని మిగిలిన చిల్లరతో అక్కడే ఏదైనా తిని కడుపు నింపుకోవచ్చని ఆలోచిస్తుంటారు. కానీ ఆర్టీసీ అధికారులకు అది ఇష్టం లేదో లేక ప్రభుత్వానికి సంపద సృష్టించి ఇచ్చి మెప్పు పొందాలనుకున్నారో ఏమో జిల్లా కేంద్రానికి గతంలో ఉన్న ఒకే ఒక్క ఆర్డినరీ బస్సును తొలగించేశారు దీంతో ప్రయాణికులపై 50–80 రుపాయల అదనపు భారం పడుతోంది. అది చాలదన్నట్లు ఎక్స్‌ప్రెస్‌ల స్థానంలో కొన్ని అల్ట్రాడీలక్స్ బస్సులు వేసి చార్జీని రూ.30 నుంచి రూ.40 అధికంగా వసూలు చేస్తున్నారు. కలెక్టర్ ఆఫీసు పనిమీద, వైద్యశాలలకు వెళ్లేవారు, ఉద్యోగులు, వ్యాపారులు, అవసరమైన సామగ్రి కొనుగోలు చేసేవారు.. ఇలా కంభం నుంచి నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ఒంగోలు వెళ్లి వస్తుంటారు. గతంలో కంభం బస్టాండ్ నుంచి ఉదయం 5.30 కు ఒక పల్లెవెలుగు బస్సు ఉండేది. ఆ బస్సు అర్ధవీడు మండలం పాపినేనిపల్లి గ్రామం నుంచి బయలుదేరుతుంది. ఆ బస్సులో అర్ధవీడు మండల వాసులతోపాటు కంభం, బేస్తవారిపేటలో ప్రయాణికులు అధికంగా ఎక్కుతుంటారు. ప్రస్తుతం ఆ బస్సును సైతం తొలగించి ఎక్స్‌ప్రెస్ వేయడంతో పేదలు అధిక ధరకు టికెట్ కొనుగోలు చేసి వెళ్లాల్సి వస్తోంది. ఎక్స్‌ప్రెస్ బస్సు రావాల్సిన సమయంలో ఒక్కోసారి అల్ట్రాడీలక్స్ నడుపుతుండటంతో ప్రయాణికుల జేబులకు చిల్లు పడుతోంది.

రేటెక్కువ.. స్పీడు తక్కువ!

అల్ట్రా డీలక్స్ బస్సులో టిక్కెట్ రేటు ఎక్కువ స్పీడుగా వెళ్తుందని భావిస్తే మీరు పప్పులో కాలేసినట్టే. ఆ బస్సులో టికెట్ రేటు మాత్రమే ఎక్కువ.. స్పీడు మామూలే. పైగా ఆ బస్సులో డ్రైవరే ఓ చేత్తో టికెట్లు కొడుతూ మరో చేత్తో స్టీరింగ్ తిప్పుతుంటాడు. పైగా దారిపొడవునా ప్రయాణికులకు ఎక్కించుకునే క్రమంలో గమ్య స్థానానికి చేరుకోవడం మరింత ఆలస్యమవుతోంది. ఒక్కోసారి ప్యాసింజర్లు టికెట్‌కు సరిపడా చిల్లర ఇవ్వకుంటే చికాకుతో గొడవలు తలెత్తుతున్నాయి. దీంతో టెన్షన్ పడుతూనే డ్రైవర్లు బస్సులు నడపాల్సి వస్తోంది.



ఒంగోలు వెళ్లేందుకు కంభం బస్టాండ్‌లో ఉన్న అల్ట్రా డీలక్స్ బస్సు



కంభం- ఒంగోలు అల్ట్రా డీలక్స్ టికెట్ రూ.185 (ఎక్స్‌ప్రెస్ కన్నా రూ.30 అధికం)

పేద ప్రజలపై అదనపు భారం



జిల్లా కేంద్రానికి గతంలో ఉన్న ఆర్డినరీ బస్సును కొనసాగించాలి. ఒక్కోసారి ఎక్స్‌ప్రెస్ బస్సు రావాల్సిన సమయంలో అల్ట్రా డీలక్స్ బస్సును పంపిస్తున్నారు. దీంతో ప్రయాణికుడిపై అదనంగా రూ.30 నుంచి రూ.40 భారం పడుతోంది. ఎక్స్‌ప్రెస్ బస్సు ఉన్న సమయంలో వేరే బస్సును పంపినా ఎక్స్‌ప్రెస్ చార్జీ మాత్రమే వసూలు చేయాలి.

– అన్వర్ బాషా, సీఐటీయూ నాయకుడు, కంభం

ప్రయాణం ఆలస్యమవుతుంది



నిత్యం ఒంగోలు బస్సులో ప్రయాణం చేస్తుంటాం. టికెట్ అధికంగా ఉన్న అల్ట్రా డీలక్స్ బస్సు ఎక్కినా కండక్టర్ లేకపోవడం, డ్రైవరే టికెట్ కొడుతుండటంతో ప్రయాణం ఆలస్యమవుతోంది. అధికారులు చర్యలు తీసుకొని అల్ట్రాడీలక్స్ బస్సుల్లో కండక్టర్‌ను నియమించాలి.

– నాయబ్ రసూల్, ప్రయాణికుడు, కంభం

వాటర్ ట్యాంకులు ఎక్కితే కఠిన చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వాటర్ ట్యాంకులపై యువకులు, విద్యార్థులు ఎక్కితే కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు హెచ్చరించారు. మంగళవారం ×వాటర్ ట్యాంకులపై యువకుల విన్యాసాలు¥ శీర్షికన ×సాక్షి¥లో ప్రచురితమైన కథనంపై పోలీసులు స్పందించారు. మంగళవారం ఉదయం ఆయన తర్లుపాడు రోడ్డు, పీఎస్‌కాలనీ, జవహర్‌నగర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉన్న వాటర్ ట్యాంకులను సందర్శించి స్థానికంగా నివాసముండే ప్రజలతోపాటు యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాటర్ ట్యాంకులపై ఎక్కి ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని హెచ్చరించారు. పాఠశాల నుంచి వచ్చిన తర్వాత, సెలవు రోజుల్లో వాటర్ ట్యాంకుల సమీప ప్రాంతాలకు వెళ్లవద్దని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారో గమనించాలని చెప్పారు.

గ్రామ రెవెన్యూ సభలో 92 అర్జీలు



లింగోజిపల్లి గ్రామసభలో అర్జీలు ఇస్తున్న ప్రజలు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని చట్టిరెడ్డిపల్లె, కొండపేట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సభకు వివిధ సమస్యలపై 92 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్‌రావు, వీఆర్ఓ వై.పి.రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో 59 అర్జీలు

కంభం: రైతులు ఏవైనా సమస్యలుంటే గ్రామసభల్లో దరఖాస్తు చేసుకొని పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కిరణ్ సూచించారు. మండలంలోని లింగోజిపల్లి, సూరేపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో మొత్తం 59 అర్జీలు వచ్చాయని, అందులో మ్యుటేషన్ 44, పార్టేషన్ 4, ఇతర సమస్యల పరిష్కారానికి 11 అర్జీలు వచ్చాయని తెలిపారు. గ్రామ సభకు ముందు గ్రామంలో ఎస్సీ కాలనీలో పర్యటించి గృహాలు లేని వారిని గుర్తించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

కంభం: మండలంలోని యర్రబాలెం గ్రామంలో ఓ మహిళ కనబడటం లేదని అందిన ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. గత నెల 15వ తేదీ ఇంట్లో నుండి వెళ్లిన మహిళ తిరిగి రాలేదని, చుట్టుపక్కల గ్రామాల్లో ఎంత వెతికినా కనిపించక పోవడంతో భర్త ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



బాలికలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేఖ

కొనకనమిట్ల: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి జాగ్రత్తగా ఉండాలని కొనకనమిట్ల ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ కె.సురేఖ సూచించారు. మంగళవారం గొట్లగట్టు గ్రామంలోని కేజీబీవీలో బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సలహాలు తెలియజేశారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, భోజనానికి ముందు తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. వీలైనంత వరకు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



వాహనదారులకు సూచనలిస్తున్న కంభం సీఐ, ఎస్సై

కంభం: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడపాలని కంభం సీఐ కె.మల్లిఖార్జున సూచించారు. పట్టణంలోని కందులాపురం కూడలి, వైజంక్షన్, బస్టాండులో మంగళవారం సాయంత్రం వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. తల్లిదండ్రులు చిన్నపిల్లలకు వాహనాలు ఇచ్చి రోడ్డుపైకి పంపించరాదని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై బి.నరసింహారావు పాల్గొన్నారు.

కౌశల్‌లో రాష్ట్ర స్థాయికి జెడ్పీ బాలుర విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యాయులు

మార్కాపురం టౌన్: కౌశల్‌లో రాష్ట్ర స్థాయికి స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలోని విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని, అపుడే వారు ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయిలో విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావటం గర్వకారణమన్నారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కె.వేణుగోపాల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. క్విజ్ విభాగంలో 8, 9వ తరగతి విద్యార్థులు హరికిరణ్, షంషీర్ ప్రథమ శ్రేణిలో, పోస్టర్ ప్రెజెంటేషన్ విభాగంలో 8వ తరగతి విద్యార్థి భానుసాకేత్ ప్రథమ శ్రేణిలో నిలిచారని పేర్కొన్నారు. ఈనెల 29, 30వ తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న పోటీ పరీక్షల్లో వీరు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్యామ్ శుభకర్, ఆంజనేయులు, శివకృష్ణ, గాలయ్య, భాస్కర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న కృష్ణచైతన్య

మార్కాపురం: కమ్యూనికేషన్ స్కిల్స్‌తో ఉద్యోగావకాశాలు పొందవచ్చని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అన్నా కృష్ణచైతన్య పేర్కొన్నారు. మంగళవారం కిట్స్ కళాశాలలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రత్యేకంగా కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలన్నారు. ఫ్యాకల్టీ మొత్తం ఈ అంశంపై శిక్షణ పొందాలన్నారు. సమర్థవంతమైన కమ్యూనికేషన్స్ ద్వారా భావవ్యక్తీకరణ చేయవచ్చని, తద్వారా ఉద్యోగం సాధించడం సులువవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎస్‌కే సలీమ్‌బాబు, హెచ్‌ఓడీలు అనీల్‌కుమార్, రామ్మోహన్, కిశోర్‌బాబు, ప్రసన్న మురళీ, అమృతవల్లి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మోడువారిన 'నిర్లక్ష్యం'!



గిద్దలూరు రూరల్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో గల బీసీ బాలికల వసతి గృహం ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టు ప్రమాదకరంగా ఉంది. పూర్తిగా ఎండిపోవడం వల్ల మట్టలు, కాయలు లేకుండా మోడుగా మిగిలింది. పక్కనే విద్యుత్ తీగలు ఉండటంతో విద్యార్థులతోపాటు స్థానికులు ఆందోదోళన చెందుతున్నారు. ఈదురుగాలులకు కొబ్బరి మాను పడిపోకముందే తొలగించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వసతి గృహం వద్ద ప్రమాదకరంగా కొబ్బరి చెట్టు

మెడికల్ కళాశాల నిర్మాణం ఆపొద్దు

- డాక్టర్ల బదిలీలను తక్షణమే నిలిపివేయాలి
- కూటమి సర్కారు నిర్ణయం మారకుంటే పేదలకు అందని ద్రాక్షలా వైద్యం
- మార్కాపురం జీజీహెచ్ ఎదుట సీపీఎం నేతల ధర్నా



కూటమి ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ జీజీహెచ్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం: మార్కాపురంలో నిలిపివేసిన మెడికల్ కళాశాల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి.సోమయ్య, పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జీజీహెచ్ వద్ద నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ.. జీజీహెచ్‌లో పనిచేస్తున్న మెడికల్ కాలేజీ డాక్టర్లు, సిబ్బంది బదిలీలను తక్షణమే నిలిపివేయాలని, కాలేజీ నిర్మాణాన్ని ప్రభుత్వమే పూర్తిచేయాలని కోరారు. పశ్చిమ ప్రకాశం జిల్లా కేంద్రంగా మార్కాపురంలో నిర్మాణంలో ఉన్న కళాశాలను నిలుపుదల చేయడం మంచిది కాదన్నారు. పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఉచిత వైద్యం అందని ద్రాక్షలా మారుతుందని, రోగులు వైద్యం కోసం కర్నూలు, గుంటూరు హైదరాబాద్, ఒంగోలు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. దళితులకు, గిరిజన ప్రజలకు వైద్యం ఇక అందని ద్రాక్షగా మారుతుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని డాక్టర్ల బదిలీలను ఆపి కళాశాల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలన్నారు. గతంలో 300గా ఉన్న ఓపీ జీజీహెచ్‌గా మారడం, వైద్యుల నియామకంతో 700కు పెరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీని ప్రైవేటీకరణం చేయడం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. ఈ విషయంలో తమతో కలిసివచ్చే పార్టీలతో కలిసి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రూబెన్, జవ్వాజి రాజు, నన్నేసా, మహబూబ్‌బాషా, సురేష్ కుమార్, కట్టా సుబ్బారావు, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.